


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆడాళ్ళూ జోహార్లూ!

**మా చిన్నప్పుడు** మామూలుగా తెల్లారేది కాదు. భళ్ళున తెల్లారేది. బయట కళ్ళాపి చప్పుడ్లూ, రోటి దంపుడ్లూ, అమ్ముకునే వాళ్ళ కేకలతోబాటు ముష్టివాళ్ళు "అమ్మా అన్నం వెయ్యమ్మా" అనడం, మా అమ్మమ్మలాంటివాళ్ళు "తెల్లారగానే అన్నం ఏంటీ?" అంటే,

"రాత్రి అలిగి పోట్లాడుకుని మానేసిన అన్నాలు ఉంటాయిగా" అని వాళ్ళు అనడం.. పిల్లలు నిద్రలేచి తీరుబడిగా ఏడుపులు మొదలుపెట్టడం, ఈ హడావిడిలోనో రేడియోలో సంస్కృత వార్తలూ... మగాళ్ళు మరీ బద్ధకస్తులుగా వుండేవారు.

"ఒసే గెడ్డం చేసుకోవాలి. నీళ్ళు పెట్టూ"

"నేను స్నానం చెయ్యాలి నీళ్ళు పెట్టూ"

"ఓ గ్లాసు మంచినీళ్ళు ఇచ్చి పో"

ఇంకో దానికి "డొక్కులో నీళ్ళు పెట్టూ"

ఛ..ఛ. పనితో పిల్లలతో, వంటతో, అమ్ముకోడానికొచ్చిన కూరల వాళ్ళతో, పక్కింటినుండొచ్చిన అప్పులవాళ్ళతో సతమతమౌతున్న ఆడవాళ్ళు ఎంత పనిలో వున్నా "చెయ్యి తీరిక లేదు" అనకూడదు. నీళ్ళు ఇచ్చి పోవాలి. అలా మగాళ్ళు యధేచ్ఛగా రాజ్యాలు ఏలిన రోజులు అవి.

"ఏవండి పావలా ఇస్తారా? మల్లెపూలు కొనుక్కోవాలి."

"పోయినవారం ఇచ్చా రూపాయి. అప్పుడే తగలపెట్టేసావా?" అని మగాళ్ళు అరవడం. సంవత్సరం అంతా అరవ చాకిరీ చేసి, ఉప్పులో, మిరపకాయల్లో, చింతపండులో మిగిల్చి రూపాయి, అర్ధరూపాయి ఏ చీటీలో కట్టుకుని స్టీలు సామాన్లూ, లేదా మూటల వాడి దగ్గర చీరలూ కొనుక్కుంటే ఇళ్ళల్లో రాద్ధాంతం అయ్యేది.

ఆడవాళ్ళు మార్నింగ్ షో కెళ్ళాలంటే 'అర్ధరూపాయి'తో బాటు మూడు గంటలు శెలవు దొరకడం గగనం అయ్యేది. నేను మా ఇంట్లో పనిచేసే శ్యామలమ్మని తీసుకుని దర్జాగా బాలాజీ టాకీస్‌లో సినిమాకి వెళ్ళేదాన్ని. ఇద్దరికీ మార్నింగ్ షోకి రూపాయి పెట్టి టికెట్టు నేను కొంటే, ఇంటర్వెల్‌లో పల్లీలు మా శ్యామలమ్మ కొనేది. అప్పుడు నా వయసు పదిసంవత్సరాలు. మా ఇద్దరికీ బాగా స్నేహం వుండేది.

శ్యామలమ్మ పెళ్ళయి ముగ్గురు పిల్లలు పుట్టి భర్త పోయాక, ఒక గుజరాతీ వంట వాడితో లేచిపోయి వచ్చేసిందట. ఆ రోజుల్లో నాకా మాటకి అర్థం తెలీక, "అమ్మా.. మనమూ రోజూ లేచిపోతాముగా. శ్యామలమ్మని అలా ఎందుకంటారూ?" అని అడిగేదాన్ని. అమ్మ టెంకి జెల్ల కొట్టేది.

శ్యామలమ్మకి ఆ తర్వాత నలుగురు పిల్లలు పుట్టి ఆ గుజరాతీ అతనూ పోయాడు.

ఏడుగురు పిల్లల్ని పెట్టుకుని దిలాసాగా ఒక్క గది ఇంట్లో వుండేది. అదేవిటో మొదటి మొగుడి తాలుకు తమ్ముడూ తోడికోడలూ, ఆడబిడ్డలూ విస్తుపోతూ వుండేవారు. శ్యామలమ్మ మొదటి భర్త మొదటి కూతురు శ్యామలమ్మ కన్నా వయసులో పెద్దదిగా అనిపించేది. శ్యామలమ్మ ఆఖరి పిల్ల నా వయసుది. దాని పేరు లత. అది గుజరాతీ రక్తంతో జాంపండులా తెల్లగా వుండేది. మా బాలాజీ టాకీస్‌లో గేట్ దగ్గర నిలబడి టిక్కెట్లు చింపే అవ్వ ఓ రోజున "శ్యామలా నీ బిడ్డని సినిమాల్లోకి పంపిస్తావా?" అని అడిగింది.

శ్యామలమ్మ వెంటనే "మా వంశం అలాంటిది కాదు" అంది. నేను షాక్..!!

మొత్తానికి ఆ అవ్వ బతిమాలగా బతిమాలగా శ్యామలమ్మ ఒప్పుకుంది. 'మా బంగారక్క' అనే సినిమాలో శ్రీదేవితో ఆడుకునే పిల్లల్లో మా పనిమనిషి కూతురు లత కూడా ఒకత్తి.

ఆ షూటింగ్ అప్పుడు శ్యామలమ్మతో శ్రీదేవి తల్లి "మీ పిల్లకేం పెడ్తావూ? చర్మం అంత బావుంది.. మా పిల్లకి చేతినిండా పొడవు పొడవు వెం(టుకలొస్తున్నాయి" అని చెప్పిందట.

లతని పిలిచి శ్రీదేవి పాటలు పాడించుకుని 'క్యాడ్‌బరీస్' చాక్లెట్స్ ఇచ్చేదిట.

ఇది విని "నేనూ సినిమాల్లో చేరతాను" అంటే మా అమ్మ క్యాడ్‌బరీస్ చాక్లెట్ కొని చేతిలో పెట్టి 'నోర్మూయ్' అంది. సినిమా రిలీజ్ అయ్యేసరికి ఆలశ్యం అయింది. లత తర్వాత పెద్ద హీరోయిన్ అయినా ఆ రోజుల్లో ఆశ్చర్యం లేదుకానీ మా శ్యామలమ్మ ఏవో కొంపలు మునిగిపోయినట్లు దానికి పదోక్లాసులోనే పెళ్ళి చేసేసింది. ఒక ఆర్.టీ.సీ డ్రైవర్‌తో.

అలా ఓ హీరోయిన్ మొగ్గలోనే ఆగిపోయింది.

శ్యామలమ్మ తల ఎగరేసి తిరిగేది. ఎవరైనా ఏమైనా అంటే పడేదికాదు. "అవును నాకు ఇద్దరు మొగుళ్ళు. పది పెళ్ళిళ్ళు చేసుకునే మగాళ్ళని ఏం అనరేం?" అని మాట్లాడేది. గొప్ప స్త్రీవాది.

శ్యామలమ్మకి నేనంటే విపరీతమైన ప్రేమ. నేను ఏనుగుల ముగ్గు వేస్తే 'ఏనుగు' అని రాయమనేవాడు మా అన్నయ్య. మా శ్యామలమ్మ మాత్రం నాకు మెటికలు విరిచి ముద్దు పెట్టుకునేది. నేను పాటపాడ్తుంటే "చెయ్యి ఖాళీలేదు.. పై కెళ్ళు" అని ఆటపట్టించేవాడు మా అన్నయ్య. శ్యామలమ్మ మాత్రం ఎస్.జానకిలా పాడ్తున్నాను అనేది.

టీ.వీ వచ్చిన కొత్తల్లో, టీ.వీలో సినిమా వస్తుంటే హీరోయిన్‌ని విలన్ రేప్ చెయ్యడానికి పరిగెడ్తుంటే, హీరోయిన్ పాడుపడ్డ ఇంట్లోకెళ్ళి మెట్లు ఎక్కేస్తుంటే మా శ్యామలమ్మ "ఓసి నీ.. పాసుకాల! వాడు రావాలనే పోతున్నావే.. ఒంటరిగా.. ఆడెవరికి తెలుస్తుందే నిన్ను కాపాడనీకి?... పో...పోవే" అని తిట్లు లంకించుకునేది. రౌడీలని హీరో కొడ్తుంటే, తనూ చేతులు వూపుతూ 'డిష్యుం, డిష్యుం' అని సౌండ్స్ చేసేది. శోభన్‌బాబు అంటే పిచ్చి.

నన్ను ఫాలో చేసి టెన్త్ క్లాసులో లవ్ లెటర్ ఇచ్చిన వాడి ఇంటికెళ్ళి, వాడి జుట్టు పట్టి ఒంగదీసి గుద్దింది. నన్ను దడిలా కాపాడేది. ఒంటరిగా వెళ్తున్నా, ఫ్రెండ్స్‌తో వెళ్తున్నా "ఎక్కడికీ.. ఎవరితో?" అని వెయ్యి ప్రశ్నలేసేది.

"మగాడు అంటే ఆకలి లేకున్నా తినే పులి. జాగ్రత్తగా వుండాలి" అనేది. ఓ గురువులా ఎన్నో బోధించేది. ప్రొద్దుట లేచినప్పటి నుండీ రాత్రి పడుకునేదాకా ఎంత పనిచేసేదో. నాకు మొదటిసారి 'బగారా బైగన్' చెయ్యడం, 'ఆలూబాత్' చెయ్యడం దగ్గర కూర్చుని తనే నేర్పించింది. చాలాసార్లు శ్యామలమ్మ నేర్పించిన గుజరాతీ వంటలూ స్వీట్లూ చేస్తూ ఇప్పటికీ తలుచుకుంటాను.

అమ్మకి నేను ఏడోక్లాసులో వుండగా, వేడినీళ్ళు గిన్నెలో తీసుకెళ్తూ, కాలుజారిపడి ఒళ్ళు కాలిపోయింది. ఆర్నెల్లు నడవలేక ఇంట్లో దేకేది పాపం. అప్పుడు అమ్మమ్మ నాగ్‌పూర్‌లో పెద్దనాన్నకి బాలేక వుండాల్సొచ్చింది. శ్యామలమ్మ 'అమ్మ'లా సేవలు చేసింది మా అమ్మకి. మొదటిసారి "మీరు బాపనోళ్ళు అయితే నాకేంటి? పిల్లలు ఆకలికి ఏడుస్తుంటే చూడలేను" అని మా వంటగదిలో కొచ్చి వంట చేసి పెట్టింది. నన్ను అయితే చాలా ప్రేమించేది. "మా తల్లి పెద్దయితే చాలా గొప్పది అవుతుంది" అనేది. నన్ను ఎవరు చూస్తున్నారు, ఎవరి చూపు ఎలా వుందీ అని కనిపెట్టి వాళ్ళని దులిపి ఆరేసేది.

మా ఆయన నన్ను ప్రేమిస్తున్నాడని మొదటగా తెలుసుకున్నది మా శ్యామలమ్మే. ఆయన అంటే ఎందుకో మంచి అభిప్రాయం. "నీకు తగ్గ పిల్లాడు బంగారం" అనేది. మా ఇద్దరికీ "పోస్ట్‌మేన్" పని చేసేది.

మా సందానీగాడి తండ్రి తాగొచ్చి వాళ్ళమ్మని ఓసారి వీధిలో కీడ్చి తంతున్నాడు. తోటకూర పెట్టిందట. కోడికూర వండకుండా.

శ్యామలమ్మ వెళ్ళి చెయ్యి పట్టి "ఆడదాన్ని కొట్టడం కూడా ఓ మగతనమ్మేరా?" అంది.

అతను పెళ్ళాన్ని వదిలేసి శ్యామలమ్మ జుట్టుపట్టుకుని, ఒంచి రెండు గుద్దులు గుద్దాడు.

నా రక్తం వుడికిపోయింది. సందానితో "మీ నాయనని గేదె వచ్చి పొడిచెయ్యాలి" అన్నాను.

సందానీ కూడా "నాకీ నాయన ముసలోడు అయినంకా, ఆడికీ నరకం చూపిస్తాయి నేను" అని నన్ను ఓదార్చాడు.

"వాడు తాగున్నాడు. వాడితో నీకెందుకే తగువు?" అంది అమ్మమ్మ.

"తాగి వుంటే తన్నొచ్చా?" అంది శ్యామలమ్మ.

మరునాడు "రేయ్ రారా బయటకి" అని ఊగుతూ వెళ్ళింది.

నేను "శ్యామలమ్మా" అని పిలవబోతే "ఒద్దు తాగి వుంది" అని అమ్మమ్మ వెనక్కి లాగేసింది.

శ్యామలమ్మ జుట్టు విరబోసుకుని గణాచారిలా వూగిపోతూ వెళ్ళి, గుభీగుభీ గుద్ది, కిందకి ఒంచి గోడకేసి నాలుగుసార్లు కొట్టింది. అంతే కింద కుప్పలా కూలిపోయాడు.

సందానీ తల్లి వంటగదిలోకెళ్ళి వేడివేడి టీ తెచ్చి తాగించింది, శ్యామలమ్మకి.

ఆ రోజులే వేరు. ఆడపిల్లలు తలల్లో కదంబం మాలలు పెట్టుకుని బస్‌స్టాప్‌లో నిలబడేరోజులు.

కూరగాయలు కొనడానికో, వెచ్చాలుకో, హరికథకో, పేరంటానికో మాత్రమే స్త్రీలు ఒంటరిగా వెళ్ళేరోజులు.

సాయంత్రం ఆరుదాటాక స్త్రీలు బయట కనపడేవారు కాదు. ఆడపిల్లలు అందరూ ఓ వయసుదాకా గౌన్లూ, పరికిణీలూ, తర్వాత లంగా ఓణీలూ వేసుకుని, జడలో చేమంతపూలో, మల్లెపూలో పెట్టుకునేవారు. ఈ చుడీదార్లూ, పంజాబీ డ్రెస్‌లూ ఇంకా ఉత్తరాది నుండి దక్షిణాదికి దిగుమతి కాలేదు.

మా అమ్మ ఉద్యోగం చేస్తుంది అని చెపితే, మా మంజూ వాళ్ళ బామ్మ "ఆడవాళ్ళూ మగాళ్ళతో సమానంగా కుర్చీల్లోనే కూర్చుంటారా ఆఫీసుల్లో?" అని అడిగింది ఓసారి.

"మీ అమ్మ డబ్బులు సంపాదిస్తుంది కదా.. మీ నాన్న మాట వింటుందా మరీ?" అని అడిగేది భవాని నన్ను.

అర్ధణా మల్లెపూలుకీ, పావలా ఆకుకూరకీ తలుపు చాటునుండి మొగుడ్ని అడిగే రోజులు అని చెప్పాగా. ఆర్థిక స్వాతంత్రం వుండేదికాదు.

మా శ్యామలమ్మకీ, మా సందానీ వాళ్ళమ్మకీ, మా అమ్మకీ ఆర్థిక స్వాతంత్రం వుండేది.

మేం ఆరోక్లాసులో వున్నప్పుడు మా మంజూ "మా అమ్మ చెప్పింది. ఆఫీసులకెళ్ళే ఆడవాళ్ళు మంచివాళ్ళు కారుట" అంది. వాళ్ళమ్మ పేరు సీతాఫలం ఆవిడ హార్మోనీ పెట్టి పెట్టుకుని, ఓ కాలు సాచి కూర్చుని "ఆలయమేలా..." అని గొంతెత్తి వుండిపోయి... "అర్చనలేలా.." అని రెండు నిమిషాల తర్వాత తలదించేది.

నేను పదో క్లాసుకి వచ్చినప్పుడు మంజూ వాళ్ళ పెద్దక్కకి ఆర్.టీ.సీలో ఉద్యోగం వేయించాడు వాళ్ళ నాన్న. ఎనిమిది మంది పిల్లల కడుపులు నింపలేక. "ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసినా మంచిగా వుండచ్చుట మా అమ్మ చెప్పింది" అంది అప్పుడు మంజు.

చాలామంది ఆడవాళ్ళు తమ ఆర్థికావసరాల కోసం మిషన్ తొక్కి బట్టలు కుట్టేవారు. మా భవానీ వాళ్ళమ్మ విస్తరాకులు కుట్టేది. మా అమ్మమ్మ ట్యూషన్‌లు చెప్పేది. మా సందు చివర వెంకటమ్మ సాయంత్రాలు మిరపకాయ బజ్జీలూ, పునుగులూ అమ్మేది. నాకు ఊహ వచ్చేసరికి కాలనీలో చాలామంది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసేవారు.

"వదినా ఓ కప్పుడు పంచదార ఇస్తావూ?"

"రెండు రూపాయిలుంటే ఇద్దూ" నుండి విముక్తి పొందారు. చీటీలు కట్టుకుని చీరలూ, స్టీలు సామాన్లూ గాడ్రేజ్ బీరువా, రేడియో, ఫ్యానూలాంటివి కొనుక్కోడం మొదలెట్టారు.

మా ఆఖరి అత్త వ్యాపారం చేస్తా అని స్టీలు సామాన్ల షాప్ పెట్టి, ఇంటికొచ్చి వెళ్ళే చుట్టాలందరికీ తలో పాత్రా ఇచ్చి దివాలా తీసింది. ఆవిడ మరీ మర్యాద మనిషి. భర్తకి హార్ట్ ఎటాకొచ్చి హాస్పిటల్లో వుంటే, చూడ్డానికొచ్చిన వాళ్ళకి ఏమైనా పెట్టాలి కదా అని లడ్డూలూ, కారప్పూసా చేసి డబ్బాల్లో ఆస్పత్రిలో పెట్టుకునేది.

మా కాలనీలో ఒకరింటి ముచ్చటలు ఒకరికి తెలిసిపోతూనే వుండేవి. కొంత మా శ్యామలమ్మలాంటి వార్తాహరుల వల్ల అయితే మరికొంత మధ్యాహ్నాలు ఆడవాళ్ళు పెట్టే మీటింగుల వల్ల.

కూరగాయలు కొనడానికి మార్కెట్‌కి వెళ్ళినప్పుడు "ఆ మూల ఇంటి వరలక్ష్మి కూతురు ఎవరో క్రిష్టియన్ అబ్బాయిని చేసుకుంటోందటగా?"

"ఆ వెనక వీధి చార్లెస్ కొంపలోకి అద్దెకొచ్చిన విద్యాధరి, అద్దెకి రాలేదుట. అతని రెండో పెళ్ళాం అంట వదినా!" అని మాట్లాడుకునేవారు.

నేనూ, సందానీ అన్నీ వినేవాళ్ళం. వాడు గుడ్లు గంపలో పెట్టుకుని అమ్ముకుంటుంటే, నేను పక్కన కూర్చుని "మా గుడ్లే కొనండి.. మా గుడ్లు మంచివి. తెల్లనివి. గుండ్రటివి. ఇందులోంచి రామచిలుకలొస్తాయి" అని అరిచేదాన్ని.

అమ్మమ్మకి బ్రహ్మాజీ తాతగారి మొదటి పెళ్ళాం చూసి చెప్పడం, ఆవిడ బెత్తంతో వచ్చి "నీ గుడ్లే కొనాలా? ఏవీ చూపించు" అని వాతలు పడేట్లు కొట్టి తీసుకురావడం చాలాసార్లు జరిగింది.

ఇంతకీ ఈ బ్రహ్మాజీ తాతగారి మొదటి పెళ్ళానికి చాలా మడి. ఊరికూరికే నీళ్ళు చల్లుకుంటూ వుండేది. పాపం ఆ కోడలు మంచిది. ఆ అమ్మాయి ఎన్ని సార్లు బాత్‌రూంకి వెళ్తే అన్నిసార్లూ చిన్న బట్టకట్టుకుని, అందులోకి వెళ్ళొచ్చి, స్నానం చేసి చీర కట్టుకోవాలి అనేది అత్తగారు.

ఆ అమ్మాయి కడుపుతోటున్నప్పుడు మిరపకాయబజ్జీ తినాలన్న కోరిక కూడా ఈవిడ కొడుకుని తీర్చనివ్వలేదు, వాడు మడికట్టుకుని చెయ్యడని.

ఈవిడకి భర్త దైవం. ఆయన వరంగల్ నుండి వచ్చేటప్పుడు ఇంకొక ఆవిడతో వచ్చేవాడు. ఆవిడ ఆయనకి రెండో పెళ్ళాం అని మా శ్యామలమ్మ చెపితే కానీ మాకు తెలీలేదు. ఆవిడ ఇస్త్రీ చీరలో, రోజా పువ్వు సైడ్‌కి పెట్టుకుని స్టైలుగా వుండేది. ఆవిడ టీచరట.

తాతగారేమో డీ.ఈ.ఓ ఇన్స్పెక్షన్‌కి వెళ్ళినప్పుడు లవ్ అయినట్టుంది. మామ్మగారేమో ఆయన కాళ్ళు కడిగి తలమీద చల్లుకునేది. సవితికి గంజి పెట్టి చీరలు ఇస్త్రీ చేసి పెట్టేది.

"మడి.. మడి" అని కోడల్ని కాల్చుకు తినేది పాపం. ఓ రోజు మా ఎదురింటి పెరుమాళ్ళు కొడుకు పెళ్ళి అయింది. ఆ కోడలు కాస్త చదువుకున్నది. వీళ్ళు లేబర్, తాగి రోజూ యాగీ చేసే రకం ఈ పెరుమాళ్ళు.

ఆ కోడలితో కాలేజీకి వెళ్ళే నేను మాట్లాడితే బావుంటుందని వాళ్ళ అత్తగారు ఫకీరమ్మ పిలిచింది. ఆ అమ్మాయి పేరు జిజియాబాయి. నెమ్మదిగా తలెత్తి "మీ ఇంటి పక్కిల్లు తాతగారు మా బాబాయి వరస" అంది.

"అదేంటి? ఆయన బ్రాహ్మలు కదా!" అని నోరు తెరిచేసాను.

"ఆయన రెండో భార్య మా స్వంత పిన్ని" అంది. నేను షాక్!

కులాంతర వివాహం తప్పు అని కాదు. సవితికి ఇన్ని సేవలు చేస్తూ, కోడలిపట్ల ఆవిడకి ఇంత మడి ఏవిటి? మొగుడికి 'మడి' లేదా? అని.

చదువుకున్నా బయటకెళ్ళి కానీ సంపాదించని ఆడవాళ్ళు ఇలాగే అత్తల పోరూ, మొగుళ్ళజోరుకి తలవంచి, "పండంటి కాపురం పాడుచేసుకుంటామా? ఆయన కాస్త కోపదారి వాడూ అప్పుడప్పుడూ తల ఏ రోకలి బండతోనో బాదుతాడు. కాస్త తాగుతాడు. తాగినప్పుడు కుషీ కోసం ఎవరినో ఉంచుకున్నాడు. అంతోటి దానికే గొడవపెట్టుకుని "పండంటి' కాపురాలు వదులుకుంటామా?" అని సర్దుకుపోతుండేవాళ్ళు.

"ఎ.వీ రమణీ.. నీకీ టీచర్ పని చేస్తాయ్ పెద్దయినంకా?" అని సందానీ అడిగేవాడు.

"టీచర్ ఎందుకూ? నేను పోలీసు ఇన్స్పెక్టర్ అవుతా" అనేదాన్ని. అప్పుడప్పుడే లేడీ ఇన్స్పెక్టర్ల సినిమాలు మొదలయ్యాయి.

"నీకీ ఇన్స్పెక్టర్.. దొంగలు తాగొస్తే నీకీ భయం కింద పడిపోతాయ్.." అని సందానీ తెగ దొర్లిదొర్లి నవ్వేవాడు. కానీ ఆనాడే మా సందానీకి స్త్రీకి ఆర్థిక స్వాతంత్రం అవసరం అని తెలుసు. లేకపోతే వాళ్ళమ్మ పిల్లల్ని ఎలా పెంచేది మరీ?

Post your comments

